సాక్షి
ఖమ్మం

శుక్రవారం । 7 । జూలై । 2023



ముగిసిన 'న్యాక్' పర్యటన

ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పర్యటన గురువారంతో ముగిసింది. 8లో



యథేచ్ఛగా పేల్చేస్తున్నారు

భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం తోగ్గూడెం స్టోన్ క్రషర్ క్వారీలో నిబంధనలు ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా బ్లాస్టింగ్ చేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వృద్ధులను ఆదరించాలి



ఖమ్మంలో వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ఖమ్మంలీగల్: వృద్ధులు, నిరాదరణకు గురైన వారి పట్ల ఆదరాభిమానాలతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా అన్నారు. ఖమ్మం, బోనకల్‌లోని వివిధ అనాథ, వృద్ధాశ్రమాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులు, అనాథల సంక్షేమంపై ఆరా తీశారు. బోనకల్‌లోని శాంతి నిలయంలో భోజన శాల అపరిశుభ్రంగా ఉండగా తగిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. భోజన శాల, వంట గదిని, సరుకుల గదిని, శౌచాలయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఖమ్మంలోని దాసరి వృద్ధాశ్రమాన్ని పరిశీలించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి ఎవరైనా తనిఖీలకు వస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. వృద్ధులు ఎవరైనా తమ పిల్లల నుంచి భరణం కోరుకున్నట్లయితే న్యాయ సేవా సంస్థ నుంచి తగిన సాయం అందిస్తామని తెలిపారు.

తెలుగు వెలుగు సాహితీ వేదిక అధ్యక్షుడిగా ఐలయ్య

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడిగా పంజాల ఐలయ్యను నియమించినట్లు వేదిక వ్యవస్థాపక చైర్మన్ రాజ్‌కుమార్, జాతీయ అధ్యక్షుడు మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో తనవంతు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని ఐలయ్య పేర్కొన్నారు.


గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్ : మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకుల ఆర్‌సీఓ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘునాథపాలెం ఎస్ఎన్ మూర్తి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన మహిళా డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూప్‌ల్లో కంప్యూటర్ సమ్మిళిత కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు మూడు జతల యూనిఫామ్, నోట్ పుస్తకాలు, ట్రాక్ షూట్, షూ, పాఠ్యపుస్తకాలు అందజేస్తామని, కాస్మోటిక్ చార్జీలు, పరీక్ష ఫీజు చెల్లిస్తామని వివరించారు. పరీక్షల సమయంలో వాచ్, ప్యాడ్, పెన్నులు తదితర వాటితో కూడిన బ్యాగ్ అందజేస్తామన్నారు. బాలురకు కొత్తగూడెం కేంద్రంగా డిగ్రీ గురుకుల కళాశాల ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రవేశాల కోసం ఎస్ఎన్ మూర్తి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇక గెస్ట్ లెక్చరర్లను తాత్కాలిక పద్ధతిలో నియమిస్తామని, ఆసక్తి గలవారు ఆర్‌సీఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

10 నుంచి రేషన్ పంపిణీ

ఖమ్మం సహకారనగర్: ఈనెల 10వ తేదీ నుంచి తెల్లకార్డు గల పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్ తెలిపారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 748 రేషన్ దుకాణాలు ఉండగా 4,12,083 కార్డులున్నాయి. వీటిలో సుమారు 11 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇకపై ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ డీలర్లకు వేలిముద్ర(బయోమెట్రిక్) ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎంఎల్ఎస్‌లలో కాంటాలు వేయకపోవడం వల్ల బియ్యం తక్కువగా వస్తున్నాయని డీలర్లు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని, ఈ క్రమంలో కాంటా వేసి బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ముగిసిన జాబ్ మేళా



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని టేకులపల్లి మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగిన జాబ్‌మేళాకు 11 మంది ఎంపికయ్యారు. ఐటీఐ, డిప్లొమా కోర్సులు అభ్యసించినవారికి నిర్వహించిన ఇంటర్వ్యూకు 54మంది హాజరు కాగా, అందులో వివిధ పోస్టులకు 11మంది ఎంపికైనట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు.

రాసుకొనేదెలా ?

ఎస్సీ, బీసీ గురుకులాలకు చేరని నోట్ పుస్తకాలు

- తరగతుల ప్రారంభంతో ఇబ్బందుల్లో విద్యార్థులు
- నోట్ బుక్స్ కొనుక్కోవాలంటున్న గురుకులాల ప్రిన్సిపాళ్లు
- పాఠ్యపుస్తకాల సరఫరా అరకొరగానే..



జిల్లాలో ఎస్సీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు	విద్యార్థుల సంఖ్య	జిల్లాలో బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు	విద్యార్థుల సంఖ్య
13	7,720	14	6,285

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని గురుకులాలకు ఇప్పటివరకు నోట్ పుస్తకాలు చేరలేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా నోట్ బుక్స్ అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ సంవత్సరం గురుకులాల ప్రారంభానికి ముందే నోట్ పుస్తకాలు చేరడం ఆనవాయితీ. అయితే ఈసారి మాత్రం ఎప్పుడొస్తాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి సరఫరా కాకపోవడంతో సొంతంగా కొనుక్కోవాలని గురుకులాల ప్రిన్సిపాళ్లు చెబుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ప్రధానంగా ఎస్సీ, బీసీ గురుకులాల్లో నోట్ బుక్‌ల కొరత ఉంది. ఇక పాఠ్యపుస్తకాలు సైతం అరకొరగానే అందినట్లు తెలుస్తోంది.

విద్యను చేరువ చేసేందుకు..

చదువు'కొనే' ఆర్థిక స్థోమత లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం ప్రభుత్వం గురుకులాలను ప్రారంభించింది. బలహీన వర్గాల వారికి విద్యను మరింత చేరువ చేసేందుకు గురుకులాల సంఖ్యను పెంచింది. విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయంతోపాటు చదువుకునేందుకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ ప్రభుత్వమే అందిస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో వివిధ పనులు చేసుకునే కూలీలు, పేదలు తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఈ కారణంగా తల్లిదండ్రులపై కొంత భారం తగ్గుతోంది. ప్రతి ఏటా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, విద్యార్థులకు అవసరమైన ఇతర సామగ్రిని విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందిస్తూ వస్తున్నారు.

నెల రోజులు కావస్తున్నా..

ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావస్తోంది. ఇంటర్ విద్యార్థులకు జూన్ ఒకటి నుంచే కళాశాలలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు నుంచే గురుకులాల్లో విద్యాబోధన జరుగుతోంది. దీంతో నోట్ పుస్తకాలు లేక పాఠశాల, కళాశాల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గతేడాది ఉపయోగించిన నోట్ పుస్తకాల్లోనే ఖాళీ పేజీల్లో ప్రస్తుత పాఠ్యాంశాలను నోట్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గురుకులాల్లో పాఠశాల, ఇంటర్ విద్యార్థులకు ఆయా సొసైటీలు ఒకేసారి నోట్ బుక్స్‌ను పంపిస్తుంటాయి. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకూ రాకపోవడంతో విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

కొనుగోలు చేసుకోవాలంటూ..

పాఠ్యాంశాల బోధన ప్రారంభం కావడంతో నోట్ పుస్తకాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నోట్ పుస్తకాలు కొనుగోలు చేసి తెచ్చుకోవాలని ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి తమకు నోట్‌బుక్స్ కొనివ్వమని అడుగుతున్నారు. ఎప్పుడూ లేనిది ఇప్పుడు నోట్ బుక్స్ కొనడం ఏంటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కొంతమంది తల్లిదండ్రులు నోట్ పుస్తకాలను కొనుగోలు చేసి ఇస్తుండగా.. ఆర్థిక స్థోమత లేని వారు సర్దుకోవాలని పిల్లలను బుజ్జగిస్తున్నారు. ఇదిలా ఉండగా.. పాఠ్య పుస్తకాల తీరు కూడా ఇలాగే ఉన్నట్లు తెలుస్తోంది. 7, 9, 10 తరగతులకు సంబంధించి ఇంగ్లిష్, గణితం, సాంఘికశాస్త్రం టైటిల్స్ కొంతమంది విద్యార్థులకు అందలేదు. దీంతో గతంలో ఉన్న పాత పుస్తకాలనే అందిస్తున్నారు.

నోట్ బుక్స్ అందించాలి..



గురుకులాల్లో మౌలిక సదుపాయాలు లేవు. ఉచిత విద్య అని చెబుతూనే అరకొర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నోట్ బుక్స్‌ను కూడా అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. పాఠ్య పుస్తకాలు కూడా అరకొరగానే సరఫరా చేశారు. ఇలా ఇన్ని ఇబ్బందుల నడుమ విద్యార్థుల చదువు ఎలా సాగుతుంది ? ప్రభుత్వం వెంటనే నోట్ పుస్తకాలు సరఫరా చేయాలి.

– వి.వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నోట్ పుస్తకాలు త్వరలోనే వస్తాయి



నోట్ బుక్స్ గురుకులాలకు ఇంకా రాలేదు. గతంలో మిగిలిన నోట్‌పుస్తకాలు కొన్నింటిని విద్యార్థులకు అందజేస్తున్నాం. ఈ ఏడాది నోట్ బుక్స్ రావడం కొంచెం ఆలస్యమైంది. ప్రస్తుతం జరుగుతున్న తరగతుల బోధనకు సంబంధించిన పాఠ్యాంశాలను పాత నోట్ పుస్తకాల్లో విద్యార్థులు నమోదు చేసుకుంటున్నారు. పాఠ్యపుస్తకాలు అందరికీ పంపిణీ చేశాం. త్వరలోనే కొత్త నోట్ బుక్స్ వస్తాయి.

– జ్యోతి, ఆర్‌సీఓ, బీసీ గురుకులాలు

పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, అదనపు కలెక్టర్ స్నేహలత తదితరులు



ప్రతి ఒక్కరికీ పథకాలు

- ఇందులో రాజకీయాలు చూడకపోవడం కేసీఆర్ గొప్పతనం
- పోడు పట్టాలతో ఫలాలన్నీ అందుతాయి
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

రఘునాథపాలెం: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకం ఏదైనా అర్హత ఉంటే ఏ పార్టీ వారని చూడకుండా అందించే గొప్ప మనసున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాల పంపిణీతో పాటు, వాటికి ప్రభుత్వం ద్వారా అందించే అన్ని రకాల పథకాలు వెంటనే వర్తించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. రఘునాథపాలెం రైతు వేదికలో గురువారం ఆయన పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో ఏ గ్రామంలో చూసినా ఎకరం రూ. 50 లక్షలకు తక్కువ లేదని, ప్రభుత్వం రూ. 800 కోట్ల నుంచి రూ. 1000 కోట్ల విలువ చేసే 1707 ఎకరాల పోడు భూములకు ఒక్క రఘునాథపాలెం మండల రైతులకే పైసా ఖర్చు లేకుండా అందిస్తోందని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, గిరిజనులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారని అభినందించారు. అర్హులైన గిరిజనులందరికీ నిష్పక్షపాతంగా పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వారం రోజుల్లోనే ఎకరానికి రూ. 5వేల చొప్పున రైతుబంధు డబ్బు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని, ఇలా ఏడాదికి రెండు సార్లు మంజూరవుతాయని వివరించారు. దురదృష్టవశాత్తు రైతు మరణిస్తే రూ. 5 లక్షల బీమా వారి కుటుంబానికి వర్తిస్తుందన్నారు. గిరివికాసం పథకం కింద సబ్సిడీ బోర్లు, ఉచిత కరెంట్, బ్యాంక్ రుణాలు, ఎరువులు, విత్తనాలు వంటి అన్ని ఫలాలు అందుతాయని తెలిపారు. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ఖానాపురం హవేలి మెయిన్ రోడ్‌లో నిర్మించే వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్లో రఘునాథపాలెం మండల రైతులు కూరగాయలు అమ్ముకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కొందరు చిల్లరగాళ్లు గ్రామాల్లోకి వచ్చి మాయమాటలు చెబుతారని, వారి మాటలు నమ్మి బతుకులు చిల్లర చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి మాట్లాడగా, ఎంపీపీ భూక్యా గౌరి, వైస్ ఎంపీపీ గుత్తా రవి, తహసీల్దార్ నర్సింహారావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ భూక్యా లక్ష్మణ్‌నాయక్, సుడా డైరెక్టర్ ఆజ్మీరా వీరునాయక్, మంచుకొండ సొసైటీ చైర్మన్ మందడపు సుధాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ మద్దినేని వెంకటరమణ, మందడపు నర్సింహారావు, అటవీశాఖ రేంజర్ బెల్లం రాధిక, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

రెండు రైళ్లకు మధిరలో హాల్టింగ్

మధిర/ఖమ్మంమయూరిసెంటర్ : మధిర రైల్వే స్టేషన్‌లో గురువారం నుంచి రెండు రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. వైజాగ్ నుంచి మహబూబ్‌నగర్ (12861) వెళ్లే లింక్ ఎక్స్‌ప్రెస్ రైలు మధిర రైల్వే స్టేషన్‌లో అర్ధరాత్రి 1.09 గంటలకు ఆగుతుంది. మహబూబ్‌నగర్ నుంచి వైజాగ్ (12862)కు వెళ్లే లింక్ ఉదయం 11.04 గంటలకు నిలుస్తుంది. ఇక తిరుపతి నుంచి సికింద్రాబాద్ (12763)కు వెళ్లే పద్మావతి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12.04 గంటలకు, సికింద్రాబాద్ నుంచి తిరుపతి (12764)కి వెళ్లే రైలు రాత్రి 10.57 గంటలకు ఈ స్టేషన్‌లో ఆగుతుంది. ఈ మేరకు బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వరరావుకు రైల్వే ఉన్నతాధికారులు సమాచారం అందించారు. ఈ రెండు రైళ్లు మధిరలో ఆగేలా చూడాలని పరిసర ప్రాంత ప్రజలు, వ్యాపారులు ఎంపీ నామాను కోరగా, ఆయన పలుమార్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు లేఖలు రాయడంతో పాటు రైల్వే మంత్రితో మాట్లాడి కృషి చేశారు.

పలువురు సీఐల బదిలీ

ఖమ్మంక్రైం: జిల్లా వ్యాప్తంగా పలువురు సీఐలకు గురువారం బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు సీఐలు బదిలీపై వెళ్తుండగా.. ముగ్గురు సీఐలు జిల్లాకు రానున్నారు. వచ్చే ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో మరింత మంది సీఐలు బదిలీ కానున్నట్లు సమాచారం. బదిలీ అయిన వారి వివరాలిలా..

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రదేశం
ఎస్.రవికుమార్	పీసీఆర్, మహబూబాబాద్	ఎస్‌హెచ్‌ఓ, ఖమ్మం–2 (టి)
సీహెచ్ శ్రీధర్	ఎస్‌హెచ్‌ఓ, ఖమ్మం–2 పీఎస్	సీఎస్‌బీ–2, ఖమ్మం
జె.వసంతకుమార్	వెయిటింగ్ ఎట్ ఐజీపీ, మల్టీజోన్–1	మధిర టౌన్ సర్కిల్
ఓ.మురళి	మధిర టౌన్ సర్కిల్	అటాచ్‌డ్ టు ఐజీపీ, మల్టీజోన్–1
ఎం.శ్రీనివాస్	సీఎస్‌బీ–2, ఖమ్మం	అటాచ్‌డ్ టు ఐజీపీ, మల్టీజోన్–1
ఎన్.అంజలి	ట్రాఫిక్–1, ఖమ్మం	పీసీఆర్, ఖమ్మం
జి.హరినాథ్‌బాబు	పీసీఆర్, ఖమ్మం	అటాచ్‌డ్ టు ఐజీపీ, మల్టీజోన్–1
పి.సర్వయ్య	డీఎస్‌బీ–1, కొత్తగూడెం	సీపీటీసీ, ఖమ్మం

పనుల్లో వేగం పెంచండి

అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి

ఖమ్మం సహకారనగర్ : మన ఊరు–మన బడి కార్యక్రమంలో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి అన్నారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో మండలాల వారీగా చేపట్టిన పనులు, పూర్తయి ప్రారంభించిన పాఠశాలలు, ఇంకా పూర్తి కాని పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే చాలా సమయం తీసుకున్నామని, రోజువారీ పర్యవేక్షణ చేసి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల కేంద్రంలో వాల్ పెయింటింగ్‌కు అనువుగా ఉన్న పాఠశాలలు గుర్తించి, ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో రూ.10 లక్షల విలువైన పనులు చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో సంబంధిత శాఖలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేయాలన్నారు.

డెంగీ నివారణకు ముందస్తు చర్యలు

జిల్లాలో డెంగీ నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్నేహలత అన్నారు. గురువారం ఐడీఓసీలో విద్యాశాఖ, మునిసిపల్, రెవెన్యూ, పంచాయితీరాజ్, ఐసీడీఎస్, డీఆర్డీఏ తదితర శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దోమల ద్వారా మలేరియా, మెదడువాపు, చికున్ గున్యా, డెంగీ, బోదకాలు తదితర వ్యాధులు వ్యాపిస్తున్నందున వాటి నివారణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామాల్లో వైద్యారోగ్య శాఖ సిబ్బందితో పాటు ఐకేపీ, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పాఠశాలలు, హాస్టళ్లలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. గ్రామాల్లో డెంగీ నివారణపై అవగాహన కల్పిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించాలన్నారు. మంచుకొండ, కల్లూరు, ఎం.వి.పాలెం, గంగారాం, లంకాసాగర్, నేలకొండపల్లి, చెన్నూర్, కొణిజర్ల, ముదిగొండ, వేంసూర్, దెందుకూరు, ఖమ్మం శ్రీనివాస్ నగర్, వెంకటేశ్వరనగర్, మామిళ్లగూడెంలో మొత్తం 711 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ బి.మాలతి డెంగీ నివారణ చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, వివిధ శాఖల అధికారులు జి. జ్యోతి, సైదులు, సాంబశివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కట్టడికి పక్కా ప్లాన్

- ముందస్తు చర్యలు తీసుకుంటున్న వైద్యారోగ్య శాఖ
- పరిసరాల పరిశుభ్రతే ముఖ్యమని ప్రజల్లో అవగాహన
- క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: ఈ ఏడాది వర్షాకాల సీజన్ ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతోంది. రెండు, మూడు రోజులుగా అక్కడక్కడా వానలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. వ్యాధుల కట్టడికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల స్థాయిలో ప్రణాళికలు రూపొందించింది. సాధారణంగా వర్షాకాలం ప్రారంభంలో డెంగీ, మలేరియా, చికున్ గున్యా, విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధులు రాకముందే ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కరోనా కారణంగా గత మూడు సీజన్లలో ఈ వ్యాధులు అంతగా వ్యాప్తి చెందలేదు. అయితే కరోనా ప్రభావం పూర్తిగా తగ్గడంతో ఈ ఏడాది సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ముందుగానే జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులను కట్టడి చేయొచ్చని అంటున్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తద్వారా వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని చెబుతున్నారు. సీజనల్ వ్యాధుల కట్టడికి గత బుధవారం నగరంలోని టీటీడీసీ భవనంలో కలెక్టర్ వి.పి గౌతమ్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యల సన్నాహక సమావేశం నిర్వహించారు. గతంలో నమోదైన కేసులపై సమీక్షించి, తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. జిల్లాలో గత రెండు, మూడు సంవత్సరాలుగా కేసులు అధికంగా నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నియంత్రణ చర్యలు చేట్టాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



వ్యాధుల కట్టడిపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)

ఈ ఏడాది నామమాత్రంగానే..

జిల్లాలో వర్షాలు జోరందుకోకపోవడంతో వ్యాధులు నామమాత్రంగానే వెలుగు చూస్తున్నాయి. అక్కడక్కడా డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఇంతవరకు 3,919 మందికి డెంగీ పరీక్షలు నిర్వహించగా 18 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 2021లో 944, 2022లో 711 కేసులు వెలుగుచూశాయి. చికున్‌గున్యా కేసులు గతేడాది 98 నమోదు కాగా, ఈ సంవత్సరం ఒక్క కేసు కూడా రాలేదు. మలేరియాదీ అదే పరిస్థితి. ప్రస్తుతం జిల్లాలో కొన్నిచోట్ల వైరల్ ఫీవర్స్ మాత్రం వెలుగు చూస్తున్నాయి.

వైద్యారోగ్య శాఖ రూపొందించిన జాగ్రత్తలివే..

- ఖాళీ స్థలాలు, సైడ్ డ్రెయిన్లు, కుండలు, పూలకుండీలు, రోళ్లు, ప్లాస్టిక్ టబ్బుల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి
- ఖాళీ స్థలాల్లో టీమోఫాస్, ఆయిల్ బాల్స్ వేయాలి
- టైర్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లు, పాత సామాన్లు, కొబ్బరి బొండాల షాపుల యజమానులను అప్రమత్తం చేసి ఎక్కడ పడితే అక్కడ వాటిని పడేయకుండా చూడాలి
- జ్వరం వచ్చిన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి
- పాజిటివ్ కేసులు నమోదైన ఇంట్లో పైరిత్రమ్ స్ప్రే చేయడం
- మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేయటం
- ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించడం
- ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహించటం
- అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టడం
- ఏఎన్ఎం, ఆశల ద్వారా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించటం
- రక్త నమూనాలు సేకరించటం
- మండల స్థాయిలో అన్ని శాఖల సమన్వయంతో వ్యాధుల వ్యాప్తిని అరికట్టడం
- ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఫాగింగ్, టీమోఫాస్ స్ప్రే చేయడం.

అన్ని శాఖల్లో పాస్‌బుక్ ప్రింటర్ సౌకర్యం

ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

ఖమ్మంవ్యవసాయం: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ పాస్‌బుక్ ప్రింటింగ్‌ను నగరంలోని బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీజీవీబీ ప్రతి బ్యాంకు బ్రాంచి మిత్ర పాయింట్ వద్ద పాస్ బుక్ ప్రింటర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖాతాదారుల సౌకర్యార్థం ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని, వీటికి సర్వీస్ చార్జీలు ఉండవని తెలిపారు.కార్యక్రమంలో ఖమ్మం రీజనల్ బ్యాంక్ ఏజీఎం, రీజనల్ మేనేజర్ విజయ భాస్కర్ గౌడ్, చీఫ్ మేనేజర్ దేవేందర్ గౌడ్, అడ్మిన్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాస్ బుక్ ప్రింటర్‌ను ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

తెలుగు రాష్ట్రాల బ్యాంకు ఆర్ఎంలతో సమావేశం

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆర్ఎంలతో ఖమ్మం రీజనల్ బ్యాంక్ కార్యాలయంలో చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. అంతరంగికంగా జరిగిన ఈ సమావేశంలో బ్యాంకు ప్రగతిపై సమీక్షించారు.

కమనీయం.. రామయ్య కల్యాణం

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో గురువారం రామయ్య నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

క్లుప్తంగా

లైసెన్స్ మేళాకు ఏర్పాట్లు పూర్తి

ఖమ్మంక్రైం : 18 ఏళ్లు నిండిన యువతకు ఖమ్మంలో శుక్రవారం నుంచి రవాణా మంత్రి అజయ్‌కుమార్ ఏర్పాటు చేయనున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు రవాణాశాఖాధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. ప్రస్తుతం ఉన్న ఐదు కౌంటర్లతోపాటు అదనంగా మూడు కౌంటర్లు ప్రారంభించారు. లెర్నింగ్ లైసెన్స్ పొందడానికి కంప్యూటర్ పరీక్షకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత రవాణాశాఖ కార్యాలయంలో కౌంటర్ల వద్ద ఫొటో, వేలిముద్ర వేయాల్సి ఉంటుందని, అనంతరం ఎంవీఐలు పరిశీలన చేస్తారని పేర్కొన్నారు. ఈమేరకు ఆర్టీఓ తోట కిషన్‌రావు, ఎంవీఐ వరప్రసాద్ ఏర్పాట్లను పరిశీలించారు.

బాలుడిపై కుక్కల దాడి

నేలకొండపల్లి: పిచ్చి కుక్కలు ఓ బాలుడిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని మంగాపురంతండాలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని మంగాపురంతండాకు చెందిన సంతోష్ అనే బాలుడు అప్పుడే పొలం వైపు వెళ్తున్న ఇద్దరితో కలిసి వెళ్తున్నాడు. ఈక్రమంలో పిచ్చి కుక్కల గుంపు వారిపై దాడికి పాల్పడ్డాయి. తొలుత సంతోష్‌పై దాడి చేయగా అప్రమత్తమైన మిగతా వారు తప్పించుకునేందుకు పరుగులు తీశారు. విషయం గుర్తించిన గ్రామస్తులు కుక్కల గుంపును గ్రామం శివారు వరకు తరిమారు. తీవ్ర గాయలైన సంతోష్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి గురువారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురం న్యూ కాలనీకి చెందిన కనతాల శ్రీను (57) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఖమ్మం – పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ మధ్య ఖమ్మం వైపు వస్తున్న గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈవిషయమై రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి అన్నం ఫౌండేషన్ అధినేత అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. దీంతో ఫౌండేషన్ వాహనంలో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

11 ఏటీఎంలతో రూ.2.80 లక్షలు డ్రా

సైబర్ నేరం కింద కేసు నమోదు



నగదు చోరీకి గురైన తల్లాడ ఏటీఎం

తల్లాడ: తల్లాడ డీసీసీబీ ఏటీఎంలో ఏటీఎంల ద్వారా రూ.2.80లక్షల నగదు చోరీ జరిగింది. తల్లాడ ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. ఈ నెల 1వ తేదీన కొందరు గుర్తు తెలియని దుండగులు తల్లాడ సహకార బ్యాంక్ ఏటీఎంలో రాత్రి సమయాన 11 ఏటీఎం కార్డుల ద్వారా రూ.2.80 లక్షలు నగదు డ్రా చేశారు. ఏటీఎం కార్డుల్లో పెట్టిన నగదు డ్రా చేసినా.. సంబంధిత అకౌంట్ల నుంచి డబ్బులు విత్‌డ్రా కాకుండా సైబర్ నేరానికి పాల్పడ్డారు. ఈ మేరకు తల్లాడ డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ రమ్యశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ సైబర్ నేరం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ పుటేజీ ఆధారంగా నేరానికి పాల్పడిన వారి ఆచూకీ కోసం ప్రయత్నం చేస్తున్నారు.


విద్యార్థిని అదృశ్యం

చింతకాని: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని అదృశ్యం కావడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు విద్యార్థిని ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్సై పొదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ఖమ్మంక్రైం: ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఖమ్మంలో చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌కు చెందిన వేముల మట్టయ్య కూతురు లక్ష్మికి ఖమ్మంలోని త్రీటౌన్ ప్రాంతానికి చెందిన గుంజా సాయితో వివాహం జరిగింది. వివాహం అయినప్పటి నుంచి అతని కుటుంబ సభ్యులు లక్ష్మిని శారీరకంగా, మానసికంగా చిత్రహింసలు పెట్టడంతో ఇంట్లో ఎవరు లేని సమయాన ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురు చావుకు సాయి, అతని కుటుంబసభ్యులే కారణం అని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

యథేచ్ఛగా పేల్చేస్తున్నారు

తోగ్గూడెం మైనింగ్‌లో ఇష్టారీతిన బ్లాస్టింగ్

- ఎక్కడా కనిపించని ఎక్స్‌ప్లోజివ్ నిపుణులు
- నిల్వలపైనా పారదర్శకత శూన్యం
- పరిమితికి మించి సామర్థ్యంతో క్వారీల్లో పేలుళ్లు


తోగ్గూడెంలోని ఓ క్వారీలో బ్లాస్టింగ్ చేసేందుకు డ్రిల్లింగ్ చేస్తున్న కూలీలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దీపావళి పండుగ మినహా మిగిలిన సందర్భాల్లో టపాసులు పేల్చాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి. ప్రభుత్వం రూపొందించిన నియమావళికి అనుగుణంగానే బాణసంచాను గోదాముల్లో నిల్వ చేయాలి. విక్రయించే దుకాణాలపై పోలీస్ నిఘా తప్పనిసరి. ఫైర్ సేఫ్టీ లేనిదే ఇక్కడ ఒక్క పనీ చేయడానికి వీల్లేదు. పెద్దగా ప్రమాదభరితం కాకున్నా టపాసుల నిల్వ, వ్యాపారం, కాల్చడం వంటి అంశాల్లో అనేక జాగ్రత్తలు పాటిస్తారు. ఇక కొండలను పిండి చేసే జిలెటిన్ స్టిక్స్, ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ వంటివి ఉపయోగించే క్వారీల్లో అడుగడుగునా జాగ్రత్తలు తీసుకుంటారనే భావన అందరిలోనూ ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

ఇష్టారీతినా పేలుడు పదార్థాల వినియోగం

జిల్లాలో నిర్మాణ రంగానికి అవసరమైన కంకరలో సింహభాగం పాల్వంచ మండలం తోగ్గూడెంలోని స్టోన్ క్రషర్ల నుంచే సరఫరా అవుతోంది. వీటికి అనుబంధంగా ఇక్కడ రాతి గుట్టలు, కొండలను పేలుడు పదార్థాలతో పేల్చేస్తుంటారు. పేలుళ్లతో కొండ రాళ్లు విరిగిపోయిన తర్వాత భారీ యంత్రాల సాయంతో వాటిని ముక్కలుగా చేస్తారు. ఆ తర్వాత లారీల్లో క్రషింగ్ యూనిట్లకు తరలిస్తారు. అక్కడ వివిధ సైజుల్లో రాళ్లను కట్ చేసి నిర్మాణ రంగంలో వివిధ అవసరాలకు ఉపయోగిస్తారు. ఇక్కడ క్వారీల నిర్వాహకులకు ప్రభుత్వం విధించిన నిబంధనలు అంటే లెక్కేలేదు. ఇప్పటికే మైనింగ్ కోసం లీజుకు తీసుకున్న స్థలానికి నాలుగింతల స్థలంలో మైనింగ్ చేపట్టారు. దీనికి సంబంధించి వందల కోట్ల రూపాయల జరిమానా విధించినా, ఇప్పటికీ ఒక్క పైసా కట్టకుండా దర్జాగా మైనింగ్ చేస్తున్నారు. ఆఖరికి లీజు గడువుతో కూడా తమకు సంబంధం లేదన్నట్టుగా అడ్డగోలుగా మైనింగ్ చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన అవినీతి, అక్రమాల్లో సహజ సంపద కొల్లగొట్టడం, ప్రభుత్వానికి పన్నులు ఎగవేయడం వంటివే ఉన్నాయి. ఎంత దోపిడీకీ పాల్పడ్డా, ఎన్ని అక్రమాలు చేసినా అడ్డుకునే వారు లేరనే ధైర్యంతో వీరి దందాలో మరో అడుగు ముందుకేశారు. క్వారీల్లో ఉపయోగించే పేలుడు పదార్థాల విషయంలోనూ ఇష్టారీతిగా వ్యవహరిస్తూ ప్రాణాంతక పరిస్థితులకు కారణమవుతున్నారు.

అనుమతి లేకుండానే బ్లాస్టింగ్..

జిల్లాలో తీవ్రవాద ప్రాబల్యం ఉండటంతో ఇక్కడ క్వారీల్లో బ్లాస్టింగ్‌లపై నిషేధం ఉంది. ఎవరైనా క్వారీల్లో బ్లాస్టింగ్ చేయాలంటే తగిన కారణాలు తెలుపుతూ కలెక్టర్ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ స్థానికంగా నెలకొన్న సున్నిత పరిస్థితుల నేపథ్యంలో జిల్లా అధికారులు సైతం ఎటువంటి బ్లాస్టింగ్‌లకు అనుమతి ఇవ్వడం లేదు. అయినప్పటికీ ఇక్కడి క్వారీలో పేలుడు పదార్థాల వినియోగం నిత్యకృత్యంగా మారింది.

భారీ పేలుళ్లు..

తోగ్గూడెం క్వారీలో బ్లాస్టింగ్ డ్రిల్స్ వేయడానికి ఏకంగా రిగ్గులనే ఉపయోగిస్తున్నారు. వ్యవసాయ బోర్లు వేసే లారీలను క్వారీలకు తీసుకొచ్చి అక్కడ కొండలకు లోతైన రంధ్రాలు చేస్తున్నారు. ఆ తర్వాత శక్తివంతమైన బాంబులతో పేలుస్తున్నారు. ఈ సమయంలో కనీసం హెచ్చరికలు కూడా జారీ చేయడం లేదు. పేలుడు తీవ్రతకు కొన్నిసార్లు బండ రాళ్లు క్వారీలకు చుట్టు పక్కల పొలాల్లోనూ పడుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లోనూ విషయం బయటకు రాకుండా ప్రైవేట్ సెటిల్‌మెంట్లతో పని కానిచ్చేస్తున్నారు.

ఇప్పటికే అనేక నిబంధనలు గాలికొదిలేసిన క్వారీ యజమానులు కనీసం బ్లాస్టింగ్స్ జరిపేటప్పుడు, పేలుడు పదార్థాల నిర్వహణలోనూ కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు.

జాడ లేని నిపుణులు

నిపుణుల పర్యవేక్షణలోనే క్వారీల్లో పేలుడు జరపాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీ క్వారీలో ఎక్స్‌ప్లోజివ్ ఎక్స్‌పర్ట్‌ను నియమించుకోవాలి. కానీ తోగ్గూడెంలో ప్రస్తుతం ఆరు క్వారీలు ఉండగా ఎక్కడా ఎక్స్‌ప్లోజివ్ ఎక్స్‌పర్ట్‌ల పర్యవేణలో పేలుడు జరగడం లేదు. కొన్ని క్వారీలు అసలు తమకు ఎక్స్‌పర్ట్‌లతో పని లేదన్నట్టుగా వ్యవహరిస్తుండగా, మరికొన్ని క్వారీల యజమానులు కాగితాలపై మాత్రమే ఎక్స్‌పర్ట్‌లు ఉన్నట్టుగా చూపిస్తున్నారు. వాస్తవంలో సమీప గ్రామ ప్రజలు, వలస కూలీలే పేలుళ్లు నిర్వహిస్తున్నారు. వీరికి ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేదు. కేవలం అనుభవంపై ఆధారపడి పేలుళ్లు జరుపుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయినా, తీవ్రంగా గాయపడినా విషయం బయటకు పొక్కకుండా క్వారీల యాజమాన్యాలు తృణమో పణమో ముట్టజెప్పి బాధితుల నోళ్లు మూయిస్తున్నాయి.

లెక్కాపత్రం లేదు

క్వారీల్లో ఉపయోగించే పేలుడు పదార్థాల నిర్వహణ అత్యంత కీలకమైన అంశం. ఇవి ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు? నిల్వ చేసేటప్పుడు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? ఏ రోజు ఎంత పేలుడు పదార్థాలను వినియోగించారు.? ఇంకా నిల్వ ఎంత? డిస్పోజ్ చేసింది ఎంత? ఇలా అన్ని విషయాల్లో పారదర్శకత పాటించాలి. రికార్డులు సక్రమంగా నిర్వహించాలి. పేలుడు పదార్థాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలి. పోలీసులు సైతం ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఎక్కడా పొరపాట్లు జరగకుండా చూడాలి. కానీ క్వారీల్లో పేలుళ్లను చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇక్కడ బ్లాస్టింగ్ విషయంలో లెక్కాపత్రం లేకుండా పోయిందనే ఆరోపణలు ఉన్నాయి.

అనుమతులులేకుండా బ్లాస్టింగ్ చేస్తే చర్యలు



తోగ్గూడెంలోని క్వారీల్లో అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను వినియోగించి బ్లాస్టింగ్ చేస్తే చర్యలు తీసుకుంటాం. క్వారీలో బండరాళ్లను పగులగొట్టేందుకు నిర్వాహకులు అనుమతులు పొందాలి. బ్లాస్టింగ్ చేసేవాళ్లకు అనుమతులు ఉండాలి. నేను ఇటీవలనే బాధ్యతలు తీసుకున్నాను. తోగ్గూడెంలోని క్వారీల్లో ఎవరెవరికి అనుమతులున్నాయనే విషయమే ఆరా తీస్తున్నాను.

–వి.వినయ్‌కుమార్, పాల్వంచ సీఐ

ముగిసిన న్యాక్ త్రిసభ్య బృంద పర్యటన


ప్రిన్సిపాల్‌కు రిపోర్ట్ అందిస్తున్న న్యాక్ బృందం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలను రెండో రోజైన గురువారం న్యాక్ బృందం సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ సదుపాయాలు, వసతులు, ప్రోగ్రామ్‌లు, కోర్సుల ఆధారంగా మూల్యాంకనం చేసి, మదింపు చేయడం ద్వారా గ్రేడ్‌ను జారీ చేయడం ఈ జాతీయస్థాయి త్రిసభ్య బృందం పర్యటన ఉద్దేశమన్నారు. న్యాక్ టీమ్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ వసంత హేలవీరెడ్డి మాట్లాడుతూ..పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ విద్యాసంస్థల లక్ష్యమన్నారు. అధ్యాపకులంతా అంకితభావంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. కళాశాల రాజకీయ, విద్య, వైద్య, సాంస్కృతిక, క్రీడలు తదితర అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నిష్ణాతులైన పూర్వ విద్యార్థులను ఈ సమాజానికి అందించిందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డా మొహమ్మద్ జాకిరుల్లాకు షీల్డ్ కవర్‌లో రిపోర్ట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వరరెడ్డి, జీవన్‌కుమార్, కేయూ ఈసీ సభ్యుడు ఆర్.సీతారామారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థిగా మంత్రి అజయ్..

న్యాక్ బృందం కళాశాలను సందర్శించిన నేపథ్యాన గురువారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పూర్వ విద్యార్థిగా న్యాక్ త్రిసభ్య బృందాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చారిత్రక కళాశాల అని, భవిష్యత్తులో విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందడానికి కావాల్సిన వనరులున్నాయని వెల్లడించారు. న్యాక్ గుర్తింపులో ఉన్నతంగా నిలిచేందుకు కృషి చేసిన ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

ఢిల్లీలో ప్రజాప్రతినిధుల షికారు


తాజ్‌మహల్ వద్ద జిల్లా ప్రజాప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నాయకుడు, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు నేతృత్వంలో ఢిల్లీ వెళ్లిన ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధులు గురువారం అక్కడ చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. రెడ్‌పోర్ట్, తాజ్‌మహల్ వంటి ప్రాంతాలను సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. చిన్నప్పుడు పుస్తకాల్లో చూసిన చారిత్రక కట్టడాలను స్వయంగా చూపించినందుకు ఎంపీకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజ్ఞాన విహార యాత్రలో కూసుమంచి జెడ్పీటీసీ ఇంటూరి బేబి, ఇంటూరి శేఖర్, ఎంపీపీ బెల్లం ఉమ, ఖమ్మం రూరల్ జెడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, యండపల్లి సింధు, నేలకొండపల్లి జెడ్పీటీసీ మరికంటి ధనలక్ష్మి, మరికంటి రేనుబాబు, రఘునాథపాలెం జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, మాలోత్ రాజా, చింతకాని జెడ్పీటీసీ పరసగాని తిరుపతి కిషోర్, ముదిగొండ జెడ్పీటీసీ పసుపులేటి దుర్గ, పసుపులేటి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు చేబ్రోలు మల్లిఖార్జునరావు, పంబి సాంబశివరావు, వాచేపల్లి లక్ష్మారెడ్డి, వేముల వీరయ్య, వీరన్న, పల్లపోతు వెంకటేశ్వరరావు, పెంట్యాల పుల్లయ్య, రావూరి శ్రీనివాసరావు, బెల్లం వేణుగోపాల్, నాయకుడు గూడ సంజీవ్ రెడ్డిలు ఉన్నారు.

దైవ దర్శనానికి వెళుతూ తిరిగిరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి
- ప్రాణాలతో బయటపడిన ఐదేళ్ల చిన్నారి


లీలారాణి (ఫైల్)


చిన్నారి వివరాలు అడిగి తెలుసుకుంటున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఉదయభాను

మధిర: ఖమ్మం జిల్లా మధిరకు చెందిన దంపతులు స్కూటీపై దైవదర్శనానికి వెళుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పట్టణానికి చెందిన సిద్దంశెట్టి రాధాకృష్ణ (38), నీలారాణి (32) దంపతులు కొన్నేళ్లుగా విజయనగరం జిల్లాలో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నారు. రాధాకృష్ణ సోదరి మధిరలోని సాయిబాబా గుడి సమీపంలో కిరాణా దుకాణం నడుపుతుంటారు. ఈ క్రమంలో రాధాకృష్ణ తన భార్య, ఐదేళ్ల కుమార్తెతో కలిసి ఇటీవల మధిర వచ్చారు. గురువారం రాత్రి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రిలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి స్కూటీపై బయలుదేరారు. ఈ క్రమంలో చిల్లకల్లు – వైరా ప్రధాన రహదారిపై ఎన్నెస్పీ కాలువ సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో దంపతులు అక్కడికక్కడే మృతిచెందగా వారి కుమార్తె ఐదేళ్ల చిన్నారి స్వల్ప గాయాలతో బయటపడింది. లారీ భార్యాభర్తలపై తొక్కుకుంటూ వెళ్లడంతో మృతదేహాలు ఛిద్రమయ్యాయి. తల్లిదండ్రుల మృతదేహాల మధ్య ఉన్న చిన్నారి 'డాడీ.. డాడీ' అంటూ హృదయ విదారకంగా విలపిస్తుంటే చూపరులు కన్నీటి పర్యంతమయ్యారు. అటుగా వెళ్లే వాహనదారులు పాపను ఎత్తుకుని బుజ్జగించి అడిగితే తమది మధిర అని చెప్పింది. మృతుల సెల్‌ఫోన్లు సైతం ధ్వంసమయ్యాయి. సమాచారం తెలుసుకున్న వత్సవాయి ఎస్‌ఐ బి.అభిమన్యు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల సెల్‌ఫోన్‌లోని సిమ్ కార్డులు తీసి మరో సెల్‌లో వేసి వారి బంధువులకు సమాచారం అందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఆయనే అంబులెన్స్ ఏర్పాటు చేసి మృతదేహాలను జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారికి మెరుగైన చికిత్స కోసం విజయవాడకు పంపించారు. ఘటనా స్థలంలో తల్లిదండ్రుల మృతదేహాల మధ్యలో ఉండి చిన్నారి రోదిస్తున్న వీడియోను సోషల్ మీడియాలో చూసిన మధిర ప్రాంత ప్రజలు మనోవేదనకు గురయ్యారు.

ఆదివాసీలకు 'పోడు' పండగ

ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

కామేపల్లి(కారేపల్లి): సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలు అందజేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపిందని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియనాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పోడు పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పట్టాలు అందజేశాక మాట్లాడారు. మండలంలోని 239మంది పోడుదారులకు 622 ఎకరాల పోడు భూమి పట్టాలను అందజేయడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. పట్టాల పంపిణీ.. సీఎం కేసీఆర్ కార్యదక్షతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ సునీత, వైస్ ఎంపీపీ అజ్మీర విజయలక్ష్మి, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, కోట రవికుమార్, ఏఓ తారాదేవి, పీఏసీ ఎస్ చైర్మన్ తీర్దాల చిదంబర్‌రావు, కోటమైసమ్మ తల్లి దేవాలయ అధ్యక్షుడు మల్లెంపాటి శ్రీనివాసరావుతో పాటు అంతోటి అచ్చయ్య, జర్పుల రామారావు, హేమ్లా, బన్సిలాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్.. ఎవరెస్ట్ శిఖరం

ఖమ్మం దొంగ కేరళలో అరెస్ట్


పట్టుబడిన ఉమా ప్రసాద్

ఖమ్మంక్రైం: ఎప్పటికైనా ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలనే ఆశతో ఓ వ్యక్తి దొంగతనాలకు పాల్పడి కటకటాలపాలయ్యాడు. దొంగతనాలతో తేలికగా డబ్బు సంపాదించవచ్చని భావించి ఖమ్మంలోనే కాకుండా ఏకంగా కేరళలోకే మకాం మార్చి అక్కడి పోలీసులకు చిక్కాడు. వివరాలిలా ఉన్నాయి. ఫిబ్రవరి 24 వ తేదీన ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన అర్బన్ మండలం పాండురంగాపురానికి చెందని ఉమాప్రసాద్ నగరంలోని రెండు దొంగతనాలు చేసి పోలీసులకు చిక్కాడు. స్థానికంగా జిమ్‌కోచ్‌గా పనిచేసే అతను ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలనే ధ్యేయంతో దొంగతనాలు చేసేవాడు. ఈ నేపథ్యాన ఓ పోలీస్ ఉన్నతాధికారి ఇంట్లోనే చోరీ చేసి కొంతకాలం ఖమ్మం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అనంతరం తెలుగు రాష్ట్రాలను వదిలి ఏకంగా కేరళను ఎంచుకొన్నాడు. అక్కడ కూడా దొంగతనాలకు పాల్పడి అక్కడే అమ్మి విమానంలో ఖమ్మం వచ్చి పోతుంటాడు. ఈ నేపథ్యాన కేరళలోని తిరువనంతపురం పోలీసులకు చిక్కిన అతన్ని విచారించగా.. ఎవరెస్ట్ శిఖరం ఎక్కడానికే ఈ దొంగతనాలకు పాల్పడుతున్నానని చెప్పాడని ఖమ్మంలోని పోలీస్ ఉన్నతాధికారికి ఫోన్ చేసి దొంగ సమాచారం అందించారు. దీంతో అతను గతంలో ఖమ్మంలో చోరికి పాల్పడిన ఉమా ప్రసాద్‌గా పోలీసులు నిర్ధారించుకున్నారు.

బోటితండాలో విషాదం

పోట్లాడుకుంటున్న ఎద్దులు మీదపడడంతో రైతు మృతి


బిక్కు (ఫైల్)

కారేపల్లి: ఎద్దులు పోట్లాడుకుంటూ.. రైతు మీద వచ్చి పడడంతో రైతుకు తీవ్రగాయాలై మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బోటితండా గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బానోత్ బిక్కు(45) తనకున్న నాలుగెకరాల్లో పత్తి, మిర్చి పంట వేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, బుధవారం సాయంత్రం చేను పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో రోడ్డుపై ఎద్దులు పోట్లాడుకుంటున్నాయి. దీంతో రోడ్డుపక్కకు తన ద్విచక్రవాహనాన్ని ఆపగా.. ఎద్దులు పోట్లాడుకుంటూ వచ్చి ఒక్కసారిగా మీదపడి బిక్కు పొట్ట, మెడ భాగాల్లో తొక్కడంతో తీవ్రగాయాలపాలైయ్యాడు. గమనించిన స్థానికులు బిక్కును ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా.. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో..కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. అందరితో కలుగోలుపుగా ఉండే బిక్కు మృతి చెందటంతో బోటితండా గ్రామంలో విషాదం నిండుకుంది. కాగా.. బిక్కు అంత్యక్రియలను గురువారం నిర్వహించగా.. మృతదేహాన్ని ఎంపీపీ మాలోత్ శకుంతల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, బోటితండా, చీమలపాడు, తొడితలగూడెం సర్పంచ్‌లు మౌనిక, కిషోర్, బానోత్ కుమార్‌లతో పాటు అడ్డగోడ ఐలయ్య, వాంకుడోతు నరేష్, గౌస్‌పాషా తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

అదుపు తప్పిన ఇసుక ట్రాక్టర్

అతివేగంతో బోల్తా కొట్టిన వైనం

నేలకొండపల్లి: అక్రమంగా తరలిస్తున్న ఓ ఇసుక ట్రాక్టర్ బోల్తా కొట్టిన ఘటన మండలంలోని కొత్తకొత్తూరు వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ముదిగొండ మండలంలోని పెద్దమండవ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ కొత్తకొత్తూరు వద్ద నందిగామ బ్రాంచ్ కెనాల్‌పై వెళ్తుండగా.. మూలమలుపు వద్ద కంట్రోల్ తప్పింది. దీంతో కాల్వను తప్పించేబోయి బోల్తా కొట్టి పక్కనే ఉన్న నరేష్ ఇంటి వైపు దూసుకెళ్లింది. ఈక్రమంలో రహదారి పక్కనే ఉన్న శ్రీనివాసరావుతో పాటు మరో వ్యక్తికి రెప్పపాటులో ప్రమాదం నుంచి తప్పినట్లయింది. కాగా బోల్తాపడిన సమయంలో ఎవరైనా ఉంటే ఏంటి పరిస్థితి అని స్థానికులు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఇసుకాసురులు అక్రమార్జన కోసం అధికారుల నుంచి తప్పించుకునేందుకు అతి వేగంగా పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.